సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 15 । సెప్టెంబర్ । 2022

ఎంపీ మాధవికి అభినందనల వెల్లువ



సాక్షి, పాడేరు: కేంద్ర కాఫీబోర్డు సభ్యురాలిగా నియమితులైన అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవికి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా విశాఖలో ఎంపీని టీటీడీ చైర్మన్, ఉమ్మడి విశాఖ జిల్లా రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, అరకు, పాడేరు ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీవీఎంసీ మేయర్ హరివెంకటకుమారి, ఏపీ నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు పుష్పగుచ్ఛాలు అందజేసి, దుశ్శాలువాతో బుధవారం ఘనంగా సన్మానించారు.

ఆన్‌లైన్‌లో ముంపు బాధితుల అర్జీలు



పోలవరం ముంపు బాధితుల అర్జీలు ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చని పోలవరం ప్రాజెక్ట్ ఆర్ అండ్ ఆర్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్ ఆదిత్య తెలిపారు.

8లో

న్యూస్‌రీల్

విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు

వైద్య సిబ్బందికి రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే హెచ్చరిక



గుర్తేడు పీహెచ్‌సీలో మందుల స్టాక్ రికార్డును పరిశీలిస్తున్న పీవో సూరజ్ గనోరే

మారేడుమిల్లి: ఆరోగ్య కేంద్రాలలోని వైద్యాధికారులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే హెచ్చరించారు. మారేడుమిల్లి, వై.రామవరం మండలం ఎగువ ప్రాంతాలలో బుధవారం ఆయన పర్యటించారు. మారేడుమిల్లిలో బస్ షెల్టర్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. వేటుకూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. అనంతరం వై.రామవరం మండలం గుర్తేడు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పీవో తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీలోని మందులు, రికార్డులను తనిఖీ చేశారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు వైద్యా సిబ్బంది అందుబాటులో ఉండి, సకాలంలో వైద్య సేవలందించాలని ఆదేశించారు. అనంతరం గుర్తేడులోని ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. తసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో వివేక్ తదితరులు పాల్గొన్నారు.

రంగురాళ్ల తవ్వకాలతో ప్రకృతి వినాశనం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్

గూడెంకొత్తవీధి/చింతపల్లి రూరల్: రంగురాళ్ల తవ్వకాల వల్ల ప్రకృతి వినాశం జరుగుతుందని పాడేరు సబ్ కలెక్టర్ వి.అభిషేక్, చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ తెలిపారు. తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీకే వీధి మండలంలోని దామ నాపల్లి, రింతాడ పంచాయతీల పరిధిలోని సిగినాపల్లి, ఎస్.కొత్తూరు, సంకాడ, ఆర్.తీములబంధ, ఈదుల బంద, కదుగుల గ్రామాల్లో, చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీ పోతురాజు గుమ్మల గ్రామంలో వారు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా రంగురాళ్ల తవ్వకాల వల్ల కలిగే అనర్థాల గురించి ఆయా గ్రామాల గిరిజనులకు వివరించారు. గతంలో తవ్వకాలు చేపట్టిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు వారు తెలిపారు. సీఐ అశోక్‌కుమార్, తహసీల్దార్ రాజుకుమార్, ఎస్‌ఐ అప్పలసూరి, ఫారెస్టు అధికారి శ్రీనివాస్, సర్పంచ్ కుందరి రామకృష్ణ పాల్గొన్నారు.

పీఎంఆర్‌సీలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

సాక్షి,పాడేరు: స్థానిక పీఎంఆర్సీలోని అకడమిక్ మానిటరింగ్ సెల్‌లో పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎంవో,సీఎంవో, జీసీడీవో పోస్టులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులు మాత్రమే ఏఎంవో, సీఎంవో పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని, జీసీడీవో పోస్టులకు మహిళా ఉపాధ్యాయులు అర్హులన్నారు. గణితం ఉపాధ్యాయులు మినహాయించి మిగిలిన ఉపాధ్యాయులంతా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

మన్యం నుంచి కోల్‌కతాకు
అమృత ఫలం

- భారీ ఎత్తున రవాణా
- వంట్లమామిడి 12వ మైలురాయి జంక్షన్‌లో రోజూ మార్కెట్
- 50 వండ్ల బుట్ట రూ.500లకు అమ్మకాలు
- లాభాలు ఆర్జిస్తున్న గిరిజనులు
- వెయ్యి ఎకరాల్లో సాగు
- విశాఖ రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు



కోల్‌కతాకు వ్యాన్‌లో తరలిస్తున్న సీతాఫలాలు



సీతాఫలాలను అమ్మకానికి తీసుకువస్తున్న మహిళ

సాక్షి,పాడేరు: జిల్లాలో సాగు చేస్తున్న అమృత ఫలాలు గిరిజన రైతులు, వ్యాపారులకు కాసుల పంట పండిస్తున్నాయి. సీతాఫలాలను పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాకు భారీగా రవాణా చేస్తూ మంచి లాభాలు పొందుతున్నారు. వంట్లమామిడి నుంచి కోల్‌కతాకు నేరుగా వ్యాన్లలో వ్యాపారులు వీటిని తరలిస్తున్నారు. జులై, ఆగస్టు నెలల్లో సుమారు కోటి రూపాయల వరకు వ్యాపారం జరిగినట్టు అంచనా.

సుమారు వెయ్యి ఎకరాల్లో..

సేంద్రియ పద్ధతిలో మెట్ట, కొండ ప్రాంతాల్లో సీతాఫలాల తోటలను గిరిజనులు సాగు చేస్తున్నారు. అనంతగిరి, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి మండలాల్లో వెయ్యి ఎకరాల్లో ఈ తోటలు ఉన్నాయి. పాడేరు మండలంలో వంట్లమామిడి, మోదాపల్లి, వనుగుపల్లి, దేవాపురం, సలుగు, జి.మాడుగులలో మండలం వంతాల, గెమ్మెలి, వంజరి, హుకుంపేట మండలంలో బాకూరు, మత్స్యపురం, జర్రకొండ, చింతపల్లి మండలంలో తాజంగి, లంబసింగి, అంజలిశనివారం, పెదబరడ, అనంతగిరి మండలంలో కాశీపట్నం తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సీతాఫలం తోటలను గిరిజనులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో దిగుబడులు భారీగా ఉన్నాయి. ప్రస్తుత సీజన్‌లో వ్యాపారం పెద్ద ఎత్తున జరుగుతోంది. రెండు నెలల నుంచి గిరిజన రైతులు సీతాఫలాలు సేకరించి అమ్మకాలు జరుపుతున్నారు.

నాలుగు జంక్షన్లలో విక్రయాలు

జిల్లాలోని అనంతగిరి మండలం కాశీపట్నం, చింతపల్లి మండలం చిత్రాలగుప్ప, పాడేరు మండలం 12వ మైలురాయి, వంట్లమామిడి జంక్షన్‌లో సీతాఫలాల వ్యాపారం రోజూ భారీగా జరుగుతోంది. వంట్లమామిడి,12వ మైలురాయి జంక్షన్ ప్రాంతాల్లో కోల్‌కతా వ్యాపారులు సీతాఫలాలను కొనుగోలు చేసి వ్యాన్ల ద్వారా తరలిస్తున్నారు. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, అనకాపల్లి, గాజువాకతో పాటు వరంగల్, హైదరాబాద్, సికింద్రాబాద్, సూర్యాపేట ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కూడా సీతాఫలాలను కొనుగోలు చేసి తమ ప్రాంతాల్లో హోల్‌సేల్, రిటైల్‌గా అమ్మకాలు జరుపుతున్నారు. 50 పండ్లు ఉన్న బుట్టను రూ.500ల నుంచి రూ.700లకు వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో గిరిజన రైతులకు ద్వారా మంచి లాభాలు పొందుతున్నారు.

రైతు బజార్లలో కౌంటర్లు

విశాఖ నగరంలోని రైతు బజార్లలో కౌంటర్లు ఏర్పాటు చేసి, వీటిని విక్రయించేందుకు ఐటీడీఏ ఈ ఏడాది చర్యలు తీసుకుంది. ఈమేరకు కొంత మంది గిరిజన రైతులు కార్డులు పొంది పలు రైతు బజార్లలో ఈ పండ్ల అమ్మకాలు జరుపుతున్నారు.

వచ్చే ఏడాది మరింతగా మార్కెటింగ్



గిరిజన ప్రాంతాల్లో సాగవుతున్న సీతాఫలాలకు మైదాన ప్రాంతాల్లో డిమాండ్ ఉంది. నగర ప్రాంతాల్లో విక్రయాలు జరిపితే గిరిజన రైతులకు మరింత లాభాలు చేకూరుతాయి. ఈ మేరకు విశాఖపట్నంలోని రైతు బజార్లలో సీతాఫలాలను విక్రయించేందుకు కౌంటర్లను అందుబాటులో తెచ్చాం. వచ్చే ఏడాది నుంచి మరింత ఎక్కువగా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తాం.

– ఆర్.గోపాలకృష్ణ, ఐటీడీఏ పీవో, పాడేరు

దిగుబడి బాగుంది



ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో వర్షాలు విస్తారంగా కురవడంతో సీతాఫలాల దిగుబడులు బాగున్నాయి. వారానికి రెండుసార్లు సేకరించి అమ్మకాలు జరుపుతున్నాం. వంట్లమామిడి సంతలో ప్రస్తుతం రెండు బుట్టల పండ్లను రూ.వెయ్యి నుంచి రూ.1400ల ధరతో విక్రయాలు జరుపుతున్నాం.

–పాంగి పుల్మో, ఒంటిపాక గ్రామం, పాడేరు మండలం.

కోల్‌కతాలో డిమాండ్



ఏజెన్సీలోని గిరిజన రైతులు సాగు చేస్తున్న సీతాఫలాలు మధురంగా ఉంటాయి. కోల్‌కతా ప్రాంతంలో మన్యం సీతాఫలాలకు మంచి డిమాండ్ ఉంది. అక్కడ మార్కెట్‌లో ఒక సీతాఫలాన్ని సైజును బట్టి రూ.30ల నుంచి రూ.50 ధరతో అమ్మకాలు జరుపుతున్నాం. అన్ని రవాణా ఖర్చులు పోను పండుకు రూ.10 వరకు వ్యాపారులకు లాభాలు చేకూరుతుంది. దీంతో ప్రతి ఏడాది సీతాఫలాలను కోల్‌కతా ద్వారా తరలించి అమ్మకాలు జరుపుతున్నాం.

– సాహు, వ్యాపారి, కోల్‌కతా.

కేజీబీవీల్లో బోధన మెరుగుపర్చాలి

కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని కేజీబీవీల్లో బోధన మెరుగుపరచాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అన్ని కేజీబీవీల ప్రత్యేకాధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. విద్యార్థుల అభ్యసన స్థాయి ఆశాజనకంగా లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానని, ప్రతి కేజీబీవీకి తక్షణం రూ.5వేలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఆర్‌వో ప్లాంట్లను వినియోగంలోకి తేవడంతో పాటు మరుగుదొడ్లకు మరమ్మతులు చేయిస్తామని, అదనంగా రెండు టాయిలెట్లను నిర్మిస్తామని కలెక్టర్ తెలిపారు. కేజీబీవీల్లో ఉన్న టీవీలకు మరమ్మతులు చేయించి ప్రతివారం విద్యార్థులకు సమాజహితానికి సంబంధించి సినిమాలను చూపించాలని డీఈవో రమేష్‌ను ఆదేశించారు. ఎస్‌వోలు కూడా తమ సబ్జెక్టును బోధించాలని, ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా శతశాతం హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

సక్రమంగా మెనూ అమలు

అన్ని కేజీబీవీల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని, ఎక్కడ నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. మెనూ అమలులో ఇబ్బందులపై కలెక్టర్ సమీక్షించారు. నిత్యావసర సరుకులు, గ్యాస్ సరఫరాలో ఇబ్బందులను పలువురు ఎస్‌వోలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థినుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారికి ప్రతీనెలా శానిటరీ సామగ్రిని పంపిణీ చేయాలని ఆదేశించారు. ఏఎన్ఎంలు లేని కేజీబీవీలను సచివాలయ ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది సందర్శించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 19 కేజీబీవీల ఎస్‌వోలు, డీఈవో, కలెక్టర్ సీసీతో కలిపి ఒక వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేసి అందులో అవసరాలను పోస్ట్ చేయాలని సూచించారు. ఒకేచోట ఐదేళ్లుగా పనిచేస్తున్న సీఆర్టీలను, మూడేళ్లు దాటి ఒకేచోట పనిచేస్తున్న ఉపాధ్యాయేతర సిబ్బందిని బదిలీ చేస్తామని, ఈ మేరకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. వారి జాబితాలను సిద్ధం చేయాలని, అంతకు ముందు పనిచేసిన ప్రాంతాన్ని కూడా ఆ జాబితాలో పొందుపర్చాలని ఆదేశించారు. గతంలో పనిచేసిన ప్రాంతానికి కాకుండా వేరే ప్రాంతానికి బదిలీ చేయడం జరుగుతుందని, నిర్ధేశించిన కాలానికి దాటి పనిచేస్తున్న వారందరికి కౌన్సెలింగ్ నిర్వహించాలని డీఈవో రమేష్‌ను ఆదేశించారు.

పింఛన్ల పంపిణీలో జిల్లా ఫస్ట్

డీఆర్‌డీఏ పీడీ మురళి



షాపును పరిశీలిస్తున్న పీడీ మురళి

కొయ్యూరు: సామాజిక పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని డీఆర్‌డీఏ(వెలుగు)పీడీ మురళి తెలిపారు. 1,21,167 పింఛన్లు పంపిణీ చేసినట్టు చెప్పారు.కొయ్యూరు,రాజేంద్రపాలెం,సూరేంద్రపాలెంలలో బుధవారం ఆయన పర్యటించారు. చేయూతపథకంలో మహిళలు ఏర్పాటు చేసుకున్న దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మట్లాడుతూ ఈనెల 22న చేయూత పథకం నిధులను ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి విడుదల చేస్తారని చెప్పారు. దీనికి సంబంధించిన అర్హుల జాబితా తయారువుతోందని తెలిపారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకానికి ఇప్పటి వరకు 152 వరకు దరఖాస్తులు వచ్చినట్టు పీడీ తెలిపారు. ప్రతీ మండలానికి మొదట ఐదు యూనిట్ల చొప్పున కలెక్టర్ మంజూరు చేస్తారని తెలిపారు. వాటిని విజయవంతంగా నిర్వహిస్తే అర్హులైన అందరికీ మంజూరు చేస్తారని చెప్పారు. జిల్లాలోని 22 మండలాల్లో 22 వేలకు పైబడి స్వయం సహాయ సంఘాలు ఉన్నాయన్నారు. బకాయిలను సకాలంలో తిరిగి చెల్లించే సంఘాలకు వెంటనే మళ్లీ రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. డౌనూరులో వృథాగా ఉన్న న్యాప్‌కిన్ తయారీ కేంద్రాన్ని,రావణాపల్లిలో జీడిపిక్కల ప్రాసెసింగ్ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు.వన్‌ధన్ వికాస్ యోజనలో వచ్చిన యూనిట్లను పనిచేయించేందుకు కృషి చేస్తామని పీడీ తెలిపారు. ఆయన వెంట ఏపీఎంలు కె.శ్రీనివాసరావు, ఏపీఎం టి.రాజుబాబు ఉన్నారు.

మరో చిన్నారి మృతి

వారం రోజుల వ్యవధిలో నలుగురు మరణం



మృతి చెందిన మణిదీప్

హుకుంపేట: మండలంలో రోజురోజుకు శిశుమరణాలు పెరుగుతున్నాయి. ముక్కుపచ్చలారని చిన్నారులు మరణించడంతో తల్లిదండ్రులకు కడుపుకోతకు గురవుతున్నారు. సక్రమంగా వైద్యం అందక, తల్లిదండ్రులు నాటువైద్యంపై ఆధారపడడంతో చిన్నారుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వారంరోజుల వ్యవధిలో నలుగురు శిశువులు ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా మండలంలోని జీకే మండ పంచాయతీ కేంద్రంలో పాంగి రామలక్ష్మి,శివకుమార్ దంపతులకు చెందిన సంవత్సరం ఐదు నెలల బాలుడు మణిదీప్ బుధవారం మృతిచెందాడు. తండ్రి శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం మణిదీప్‌కు జ్వరం వచ్చి వెంటనే తగ్గిపోయింది. బుధవారం తెల్లవారు జామున నాలుగు గంటల సమయం నుంచి 5గంటల మధ్యలో మూర్ఛ లక్షణాలతో బాలుడు బాధపడ్డాడు. నాలుగు సార్లు విరేచనలై స్పృహ తప్పిపోవడంతో నాటు మందు తినిపించారు. ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఉదయం 6గంటల సమయంలో 108కి సమాచారం అందించామని, అప్పటికే మృతి చెందాడని తండ్రి,కుటుంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు. ఉన్నట్టుండి గంటల వ్యవధిలోనే బాలుడి ప్రాణాలు పోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ వారం రోజుల్లో గడుగుపల్లి,బొడ్డాపుట్టు,భామవరం, ఇప్పుడు జీకేమండలో నలుగురు చిన్నారులు మృతి చెందడంతో గిరిజనులు భయందోళన చెందుతున్నారు.

అవగాహన లోపంతోనే శిశు మరణాలు

ముక్కుపచ్చలారని చిన్నారులకు సకాలంలో సక్రమమైన వైద్యం అందించలేకపోవడంతో మరణాలు సంభవిస్తున్నాయి. మండలంలో గత ఆరు నెలల వ్యవధిలో 8 మందికి పైగా చిన్నారులు మరణించారు. సూకురు,హుకుంపేట, గడుగుపల్లి,బొడ్డాపుట్టు గ్రామాల్లో చిన్నారులు పుట్టిన నెలల వ్యవధిలోనే మృతి చెందారు. తల్లిదండ్రుల్లో అవగాహన లోపం, సకాలంలో వైద్యం అందించకపోవడం, నాటు వైద్యులను ఆశ్రయించడం తదితర కారణాల వల్ల శిశు మరణాలు సంభవిస్తున్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు. మూడు రోజుల క్రితం గడుగుపల్లి గ్రామానికి చెందిన తమర్బ ఝూన్సీరాణి, రాజేష్‌పడాల్ దంపతులకు చెందిన 3నెలల బాబు, బొడ్డాపుట్టు గ్రామానికి చెందిన సతక ఈశ్వరి,సురేష్ దంపతుల 8నెలల పాప శ్వాశ తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడి మృతి చెందారని, గడుగుపల్లి గ్రామానికి చెందిన బాబు కు ఊపిరి తిత్తుల్లోకి పాలు ప్రవేశించడంతో మరణించినట్టు వైద్యులు తెలిపారు. పిల్లలు ఊపిరి సక్రమంగా తీసుకోలేకపోతే పీడలు పట్టాయని గిరి పూజారులతో పూజలు చేయిస్తున్నారని, చిన్నారుల వ్యాధి కాస్త ముదిరి మరణిస్తున్నారని విద్యావంతులు చెబుతున్నారు.

మావోయిస్టుల కోటలో ఎస్పీ

- పరివర్తన కార్యక్రమంలో రైతులకు రాజ్‌మా విత్తనాల పంపిణీ
- గంజాయి వీడి ప్రత్యామ్నాయ పంటలు పండించాలని సూచన



ఇంజరి సభలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్ కుమార్

పెదబయలు: గిరిజన రైతులు గంజాయి సాగును వీడి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని, రైతు కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. మండలంలోని మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతం ఇంజరి పంచాయతీ కేంద్రంలో బుధవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పరివర్తన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీలోని పలు గ్రామాల రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశారు. కోండ్రుం, ననుబరి, తగ్గిపాడు తదితర గ్రామాల ప్రజలతో ఆయన మమేకమయ్యారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ పోలీసుశాఖ ఆధ్వర్యంలో మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని,రహదారుల నిర్మాణానికి ప్రాధ్యానం ఇస్తున్నామని చెప్పారు. ఎన్నడూ లేని విధంగా రోడ్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. గుల్లేలు జంక్షన్ నుంచి ఇంజరి కోండ్రుం, వంచుర్బ నుంచి తల్లాబు వరకు రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నట్టు చెప్పారు. మద్దిగరువు నుంచి జక్కం, జక్కం నుంచి కోండ్రుం గ్రామం వరకు తారు రోడ్లు నిర్మించనున్నట్టు తెలిపారు. యువత చెడు పనులకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. రైతులు ఉద్యానవన పంటలపై దృష్టి పెట్టాలని, సిల్వర్ ఓక్ మొక్కలు వేసుకుని కాఫీ, మిరియాలు సాగు చేయాలని సూచించారు.విద్యావంతులైన యువతీయువకుల ఉపాధి కల్పనకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇంజరిలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాల నిర్మాణ పనులు వారంరోజుల్లో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏ సమస్య ఉన్నా తమకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఇంజరి పంచాయతీ నుంచి పెద్ద ఎత్తున మహిళలు, రైతులు పరివర్తన సభకు తరలివచ్చారు. జి.మాడుగుల సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ మనోజ్‌కుమార్, మండలవ్యవసాయ అధికారి శ్రీనివాస్, నాయకులు రామారావు,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనచోదకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ప్రసంగాన్ని డిజిటల్ తెరపై స్థానిక పోలీసులు ప్రదర్శించారు. సీఐ రవికుమార్, ఎస్‌ఐ గోపీ నరేంద్రప్రసాద్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌పై ఎస్పీ ప్రయాణం

పెదబయలు నుంచి ఇంజరి వరకు 40 కిలోమీటర్లు ఎస్పీ బైక్‌పై ప్రయాణించారు. తల్లాబు నుంచి మట్టి రోడ్డులో ప్రయాణం చేశారు. 2017లో అప్పటి ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ హెలికాప్టర్‌లో ఇంజరి వెళ్లారు. ఆ తరువాత సతీష్‌కుమార్ బైక్‌పై వెళ్లారు.



ఇంజరి గ్రామానికి బైక్‌పై వెళుతున్న ఎస్పీ సతీష్ కుమార్

నిలకడగా వరద



కూనవరం వద్ద బ్రిడ్జి అంచును తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి



చింతూరులో నీట మునిగిన ఇళ్లు

చింతూరు: విలీన మండలాలైన చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో వరద ఉధృతి నిలకడగా ఉంది. నాలుగు మండలాల్లో బుధవారం మధ్యాహ్నం వరకు పెరుగుతూ వచ్చిన గోదావరి, శబరి నదుల నీటి ప్రవాహం సాయంత్రానికి నిలకడగా ఉంది. ఎగువనున్న భద్రాచలంలో గోదావరి క్రమేపీ తగ్గుతుండడంతో నాలుగు మండలాల్లో వరద నీరు తగ్గే అవకాశముంది. వీఆర్‌పురం మండలంలో వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ, శ్రీరామగిరి, చింతరేగుపల్లి, ఇసునూరు, తుమ్మిలేరు గ్రామాల్లోని కొన్ని ఇళ్లలోకి వరదనీరు చేరింది. కూనవరం మండలం కూనవరంలో ఉదయ్‌భాస్కర్ కాలనీ, గిన్నెలబజారు, బస్టాండ్ సెంటర్, శబరి కొత్తగూడెం, కొండ్రాజుపేట గ్రామాల్లోకి నీరు ప్రవేశించింది. వాగులనీరు రహదారిపైకి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కూనవరం, చింతూరు, వీఆర్‌పురం, చింతూరు మండలాల నడుమ కూడా వరదనీటి కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. శబరినది ఉధృతికి చంద్రవంక, కుయిగూరు, వీరాపురం వాగులు పొంగడంతో జాతీయ రహదారులు నీటమునిగాయి. విజయవాడ, జగదల్‌పూర్ జాతీయ రహదారి–30పై వరదనీరు చేరడంతో మన రాష్ట్రం నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరు, మల్కన్‌గిరి జాతీయ రహదారి– 326పై వరదనీరు చేరడంతో వరుసగా నాలుగో రోజు కూడా ఒడిశాకు రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరు వద్ద శబరినది 40 అడుగులకు చేరుకోవడంతో చింతూరు, వీఆర్‌పురం రహదారిలో దుకాణాలతో పాటు సంత మార్కెట్, టోల్‌గేట్ ప్రాంతాల్లో కొన్ని ఇళ్లు నీట మునిగాయి.

కూనవరం: వరద తగ్గే అవకాశం ఉందని సెంట్రల్ వాటర్ కమిషన్(సీడబ్ల్యూసీ) అధికారులు చెబుతున్నారు. కూనవరం–టేకులబోరు మధ్య పోలీసు స్టేషన్ సమీపంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి వరద నీరు చేరడంతో నిత్యావసరాలు తెచ్చుకునేందుకు, కోతులగుట్ట ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లేందుకు నాటుపడవ ఏర్పాటు చేశారు. పంద్రాజుపల్లి సమీపంలో రాకపోకలు యథావిధిగా కొనసాగేందుకు రెండు పడవలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ కె.అనసూయ తెలిపారు.

వీఆర్ పురం: పునరావస కేంద్రాల్లో తలదాచుకుంటున్న వరద బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం కంటే వరదనీరు బుధవారం మరో మూడు అడుగులమేర పెరిగింది. వడ్డిగూడెం,వడ్డిగూడెం కాలనీ,శ్రీరామగిరి,పోచవరం ,ఇసునూరు,చింతరేవుపల్లి తదితర గ్రామాల్లోని మరికొన్ని ఇళ్లు నీటమునిగాయి. రాజుపేట,సీతంపేట ,రేఖపల్లి ,ధర్మతాళ్లగుడెం,గున్నంకొండ,వీఆర్‌పురం,చింతరేవుపల్లి గ్రామాల్లోని వరి ,మిర్చి చేలను వరద నీరు ముంచెత్తింది. నీరు నిల్వ ఉండి నారు పూర్తిగా కుళ్లి పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చాపరాయి వద్ద నూతన జంట ఆత్మహత్యాయత్నం

దంపతులు రంగారెడ్డి జిల్లా వాసులు



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన జంట

డుంబ్రిగుడ: మండలంలోని పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం సమీపంలో పెదపాడు రోడ్డు వద్ద కొత్తగా పెళ్లయిన జంట పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా గోపాల్‌రెడ్డి నగర్, సిరిలింగాపల్లి గ్రామానికి చెందిన పి.సంతోష్‌కుమార్, సునీతలకు కొద్ది నెలల కిందట వివాహం జరిగింది. వారు హైదరాబాద్ నుంచి బస్సులో విశాఖపట్నం చేరుకున్నారు. బుధవారం స్థానిక పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతాన్ని సందర్శించి, సమీపంలోని పెద్దపాడు రోడ్డు పక్కన చెట్టు కింద పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్టు ఎస్‌ఐ తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆ జంటను అటుగా వెళ్తున్న స్థానిక గిరిజనులు చూసి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, గ్రామ వలంటీర్ సాయంతో డుంబ్రిగుడ పీహెచ్‌సీకి తరలించి, వైద్య సేవలు అందించారు. సునీత గర్భిణి కావడంతో చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమంగా ఉండడంతో అరకు లోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పులు ఎక్కుగా ఉండడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉంటారని బాధిత జంట బంధువులు ఫోన్‌లో తెలిపారని ఎస్‌ఐ సంతోష్‌కుమార్ చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

మ్యుటేషన్‌లో అలసత్వం సహించేది లేదు

కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మ్యుటేషన్లను వేగవంతం చేయాలని, అలసత్వం వహించిన తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందికి నోటీసులు జారీ చేస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఐటీడీఏ పీవోలు, సబ్ కలెక్టర్‌లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మ్యుటేషన్ జారీలో కొంతమంది కావాలనే ప్రజలను ఇబ్బంది పెడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, అటువంటి వారందరికీ సంజాయిషీ నోటీసులు జారీ చేయాలని జేసీ జె.శివ శ్రీనివాస్, డీఆర్‌వో బి.దయానిధిలను ఆదేశించారు. మ్యుటేషన్లు, ఇతర ధృవపత్రాల జారీలో అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయం సిబ్బంది హాజరు యాప్ ద్వారా నమోదు చేయాలని, సచివాలయ ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు గ్రామాలను సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్య కార్యక్రమాలు విస్తృతం చేయాలని ఆదేశించారు. జగనన్న తోడు పథకానికి సంబంధించి 4541 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటిని వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలో 13556 గృహాలు మంజూరయ్యాయని, కొన్ని గృహాలకు రిజిస్ట్రేషన్ జరగలేదని, చింతపల్లిలో 677 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ వారంలో రిజిస్ట్రేషన్, జియోట్యాగింగ్ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు ఆర్.గోపాలకృష్ణ, సూరజ్ గనోరే, జేసీ శివ శ్రీనువాసు, పాడేరు, రంపచోడవరం సబ్ కలెక్టర్లు వి.అభిషేక్, కట్టా సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



బరిసింగి గ్రామానికి కాలినడకన వెళ్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

తాగునీటి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

సాక్షి, పాడేరు: తాగునీటి పనులకు నిధులు మంజూరు చేస్తామని, తాగునీటి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మండలంలోని డి.గొందూరు, డోకులూరు, బరిసింగి, దేగలవీధి గ్రామాల్లో బుధవారం కలెక్టర్ పర్యటించి తాగునీటి పథకాలు, రహదారులను పరిశీలించారు. దేగలవీధి నుంచి బరిసింగి వరకు రహదారి బురదమయంగా ఉండడంతో కిలోమీటరు కాలినడకన వెళ్లి అసంపూర్తిగా ఉన్న తాగునీటి పథకం, శిథిలమైన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. అడ్వాన్సుగా రూ.3లక్షలు మంజూరు చేస్తామని, తాగునీటి పనులు పూర్తి చేసి బిల్లులు వచ్చాక తిరిగి చెల్లించాలన్నారు. పాఠశాల భవనం నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. అనంతరం డోకులూరు సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశమయ్యారు. మ్యుటేషన్లలో జాప్యం చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. డోకులూరు గ్రామంలో తాగునీటి పథకం మోటారు చోరీకి గురవడంతో రెండు రోజుల నుంచి మంచినీటి సరఫరా కావడం లేదని సర్పంచ్ కలెక్టర్ దృష్టికి తేవడంతో పంచాయతీ నుంచి ట్రాన్స్‌కో అధికారులకు మీటరు రుసుము చెల్లించి మీటరు బిగించాలన్నారు. డోకులూరు గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏడాదిగా పనులు జరగడం లేదని తెలుసుకుని వెంటనే పనులు ప్రారంభించకపోతే హిట్‌లిస్టులో పెట్టి భవిష్యత్‌లో పనులు చేయకుండా తగిన చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. మూడు గ్రామాల్లో పలు సమస్యలపై వినతులు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పి.లీలా కృష్ణ, డీఈ విజయకుమార్, ఎంపీడీవో సాయి నవీన్, ఎంఈవో సరస్వతిదేవి, ఎంపీటీసీ కె.కనకాలమ్మ, డి.గొందూరు, డోకులూరు సర్పంచులు సీదరి రాంబాబు, కె.సన్నిబాబు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ముంపు బాధితుల అర్జీలు

ఆర్ అండ్ ఆర్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్ ఆదిత్య

రంపచోడవరం: పోలవరం ముంపు బాధితుల అర్జీలు ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చని పోలవరం ప్రాజెక్ట్, ఆర్ అండ్ ఆర్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. సబ్ కలెక్టర్ కట్టా సింహాచలంతో కలిసి స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలో ఉన్న చిన్న చిన్న సమస్యలను కూడా అన్‌లైన్ నమోదు చేయాలని ఆదేశించారు. నాడు-నేడు పథకం ద్వారా ఖర్చుపెట్టిన నిధులు ఎం.బుక్‌లో ఏవిధంగా నమోదు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రతి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్ ఆదిత్య

ఐదు కిలోల గంజాయి పట్టివేత

నలుగురి అరెస్టు, కారు సీజ్

మోతుగూడెం: సీలేరు ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న ఐదు కిలోల గంజాయిని డొంకరాయిలో బుధవారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలివి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చింతూరు పోలీసు పోలీసు స్టేషన్ పరిధిలోని డొంకరాయిలో ఎస్ఐ నరసింహమూర్తి సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా స్విఫ్ట్ డిజైర్ కారును తనిఖీ చేయగా ఐదు కిలోల గంజాయి లభ్యమైంది. ఈ గంజాయి సీలేరులోని చల్లనిశిల్ప ప్రాంతం నుంచి తెలంగాణలోని వికారాబాద్‌కు తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.15వేలు ఉంటుందన్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని కారును సీజ్ చేసి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడ్డ గంజాయి, నిందితులతో ఎస్ఐ నరసింహమూర్తి, పోలీసు సిబ్బంది

145 బాటిళ్ల అక్రమ మద్యం స్వాధీనం

సాక్షి,పాడేరు: డుంబ్రిగుడ మండల కేంద్రంలోని మద్యం అక్రమంగా అమ్ముతున్న బెల్టు షాపుపై జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశాల మేరకు పాడేరు టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం మెరుపుదాడి చేశారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న డుంబ్రిగుడకు చెందిన మఠం భీమరాజును అరెస్టు చేసి 145 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ డీవీజీ రాజు విలేకరులకు తెలిపారు. ఒడిశాకు చెందిన 92 మద్యం బాటిళ్లు, ఏపీకి చెందిన 53 మద్యం బాటిళ్లు సీజ్ చేసి పాడేరు టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించామని, కేసు నమోదు చేసామన్నారు. ఈ దాడుల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ జె.కూర్మారావు, ఎస్ఐ చిన వీరరాజు, హెచ్‌సీ కె.త్రినాథరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

విజయవంతంగా రొమ్ములో కణితి తొలగింపు

గంగవరం: రొమ్ములో కణితి ఏర్పడి అనారోగ్యంతో బాధపడుతున్న ఓ గిరిజన యువతికి భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేసి ఆ కణితిని వైద్యులు తొలగించారు. వివరాలిలా ఉన్నాయి. గంగవరం మండలం ఆముదాలబంద గ్రామానికి చెందిన చోడి లక్ష్మీ దుర్గ(21) అనే గిరిజన యువతి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈమెకు రొమ్ములో కణితి ఉన్నట్టు రాజమండ్రికి చెందిన ప్రైవేటు వైద్యులు గుర్తించి ఆపరేషన్ చేయాలని ఇందుకు రూ.20 వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. అంత ఆర్థిక స్థోమత లేక తల్లిదండ్రులు చోడి మల్లేశ్వరరావు, బాపనమ్మ ఈ విషయాన్ని గంగవరానికి చెందిన బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కుంజం సత్యనారాయణమ్మ దృష్టికి తీసుకువెళ్లారు. సత్యనారాయణమ్మ స్పందించి సొంత ఖర్చులతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. డా. మల్లేష్, డా. రామకృష్ణ ఆధ్వర్యంలో ఆపరేషన్ చేసి ఆ కణితిని తొలగించారు.

చెట్లు కోసే మిషన్ తగిలి వ్యక్తికి గాయాలు

హుకుంపేట: చెట్లు కోసే యంత్రం తగిలి వ్యక్తికి గాయలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తడిగిరి పంచాయతీ బొడ్డాపుట్టు గ్రామానికి చెందిన గెమ్మెలి రామలింగం అనే వ్యక్తి తన ఇంటివద్ద చెట్లు కోసే యంత్రంతో కలపను కోస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్ ఆయన మీద పడింది. దీంతో ఎడమ చేతికి, ఎడమ కాలికి బలమైన గాయాలయ్యాయి. యంత్రంలో ఉన్న బ్లేడ్ బలంగా తగలడంతో శరీర నరాల భాగం వరకు కోసుకుంది. కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించి వాహనం ద్వారా పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి బాగానే ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయిన కారు

గూడెంకొత్తవీధి: మండలంలోని ప్రధాన రహదారి రామగెడ్డ మలుపు వద్ద ఓ కారు మంగళవారం అర్ధరాత్రి అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. ఈ వివరాలిలా ఉన్నాయి. తుని ప్రాంతం నుంచి దారాలమ్మతల్లి ఆలయాన్ని దర్శించుకునేందుకు కారులో ఐదుగురు ప్రయాణిస్తుండగా రామగెడ్డ మలుపు వద్ద కారు అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో స్వల్ప గాయాలు పాలైన ప్రయాణికులను ఆర్‌వీ నగర్ పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక వైద్య సేవలు అందించారు. బుధవారం ఉదయం స్థానికుల సాయంతో కారును బయటకు తీసారు.

అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేలు

సాక్షి, పాడేరు: ఏపీ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పాడేరు, అరకులోయ, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మిలు బుధవారం అమరావతికి తమ వాహనాల్లో బయలుదేరారు. ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయి. అసెంబ్లీ సమావేశాల్లో తమ నియోజకవర్గాల పరిధిలోని పెండింగ్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. సమావేశాలు ముగిసిన తర్వాత ప్రజలకు నియోజకవర్గ కేంద్రాల్లో అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యేలు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తమ వ్యక్తిగత సహాయకులకు ఫోన్ సమాచారం ఇవ్వాలని కోరారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

సాక్షి,పాడేరు: పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, జిల్లాలో నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో 770 పోస్టులు భర్తీ చేస్తున్నామని, అపోలో ఫార్మసీ, మదర్ అండ్ ఫాదర్ నర్సింగ్ సర్వీసెస్, ఎస్‌బీఐ కార్డ్స్, వరుణ్ మోటార్స్, పేటీఎం సర్వీసెస్, డెక్కన్ కెమికల్స్, అరబిందో ఫార్మాస్యూటికల్స్, హెటిరో డ్రగ్స్, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్ట్సు, ఎంఎస్ఎన్ లేబోరేటరిస్, మోహన్ స్పిన్‌టెక్స్ తదితర 11 సంస్థలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఇంజినీరింగ్, డిగ్రీతో పాటు 18 నుంచి 30ఏళ్ల లోపు వయస్సు ఉన్న యువతీ, యువకులంతా సంబంధిత ధ్రువపత్రాలు, విద్యార్హత పత్రాలతో పాటు ఆధార్, పాన్‌కార్డు జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో జాబ్ మేళాకు హాజరుకావాలన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు క్విజ్ పోటీలు

గంగవరం: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికొన్నత పాఠశాలలో మండల స్థాయి అకడమిక్ కార్యక్రమాలు నిర్వహించినట్టు మండల అకడమిక్ ఆఫీసర్ ఆర్.వి.వి.సత్యనారాయణ చెప్పారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ తదితర పోటీలు నిర్వహించామని, పోటీల్లో విజేతలు ఈనెల 21, 22 తేదీల్లో రంపచోడవరంలో నిర్వహించే డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. హెచ్ఎం జాన్సీహేన్సన్, జగ్గారావు, పీడీ నాగమణి, పీఈటీలున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

మారేడుమిల్లి: కుండాడ పంచాయతీ నుంచి నుంచి జీయంవలస వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు పనులను బుధవారం కుండాడ సర్పంచ్ కుండ్ల ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. చిరంజీవి రెడ్డి, బేబి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలపై అవగాహన

అనంతగిరి: మండల కేంద్రంలోని అనంతగిరి సచివాలయాన్ని ఎంపీడీవో శ్రీహర్షిత్ బుధవారం సందర్శించారు. వైఎస్సార్ చేయూతకు అందిన దరఖాస్తులను పరిశీలించారు. గ్రామ సచివాలయ సేవలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

గ్రామాల్లో సర్వే

అరకులోయ రూరల్: సుంకరమెట్ట పంచాయతీలో ఎస్.బెడగుడ, సుంకరమెట్ట తదితర గ్రామా ల్లో వీఆర్వో అమ్మలు, సిబ్బంది ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలపై సర్వే చేశారు. అర్హులందరికీ పట్టాలు అందజేస్తామన్నారు. సర్వేయర్ మనిష, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాసి, మాజీ సర్పంచ్ ప్రసాద్ తదితరులున్నారు.

బకాయి సొమ్ము చెల్లించాలి

అరకులోయ రూరల్: కాఫీ బకాయి సొమ్ము చెల్లించాలని కాఫీ రైతులు, వివిధ ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేశారు. గిరిజన సంఘం నేత సురేంద్ర మాట్లాడుతూ 14 పంచాయతీల పరిధిలో కాఫీ రైతులకు బకాయిలు చెల్లించాలని, పల్పింగ్ యంత్రాలు అందించాలని, అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

డ్వాక్రా సంఘాల ఆడిట్

రాజవొమ్మంగి: డివిజన్‌లోని అన్ని డ్వాక్రా సంఘాలకు ఆడిట్ చేసే ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైనట్టు ఏపీడీ శ్రీనివాస్ తెలిపారు. డ్వాక్రా సంఘాలకు చెందిన రుణాలు, రికవరీ, జమ, ఖర్చు తదితర అంశాలపై ఆడిట్ జరుగుతుందన్నారు. అనంతరం ప్రతి సంఘం తమ నిధుల నుంచి సీఆర్పీలకు రూ. 250 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సీసీలు, వీఓఏలు, గ్రూపు లీడర్లు రికార్డులు సిద్ధం చేసుకోవాలన్నారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ

ముంచంగిపుట్టు: జర్జుల పంచాయతీ బోదిలిగూడ గ్రామంలో రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించిన రాజ్‌మా విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు.

అక్రమ కట్టడం పనుల నిలిపివేత

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని పిఆర్ రోడ్డును ఆనుకొని ఓ గిరిజనేతరుడు డ్రైనేజీ గోడను ఆక్రమించి పనులు చేయడంపై ఎంపీడీవో ప్రభాకరం, అఖిల పక్ష నేతలు అడ్డుకొని నిలిపివేశారు. గిరిజన చట్టాలను, హక్కులను అతిక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో ప్రభాకరం గిరిజనేతరుడిని హెచ్చరించారు. మండల కేంద్రంలో డ్రైనేజీని అక్రమించి, నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు.

కాఫీ బోర్డు సభ్యుడిగా విశ్వనాథం



దుంబ్రిగుడ: కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడిగా తాంగుల విశ్వనాథం నియామకంపై బీజేపీ నాయకులు కామేశ్వరరావు, సాయి ధర్మరాజు తదితరులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. విశ్వనాథం మాట్లాడుతూ కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడిగా పదవిని అప్పగించిన కేంద్ర అధికార యంత్రాంగానికి రుణపడి ఉంటాన పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

చింతపల్లి రూరల్: పెంటపాడులో సర్పంచ్ పుష్పలత, జెడ్పీటీసీ బాలయ్య పర్యటించారు. గ్రామంలో గ్రావిటీ పథకం ద్వారా తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. దీనిపై ఏఈ స్వర్ణ మాట్లాడుతూ వారం రోజుల్లో గ్రామానికి పూర్తిస్థాయిలో తాగునీరందిస్తామన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

రంపచోడవరం/ముంచంగిపుట్టు: ముసురుమిల్లి, ముంచంగిపుట్టు గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలల్లో హిందీ భాషా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. హిందీ భాష ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. హిందీ టీచర్లు ఆదివిష్ణు, లవకుశను సన్మానించారు. హెచ్ఎంలు కుమార్, మాణిక్యలరావు, టీచర్లు పాల్గొన్నారు.

పథకాల అమలులో అధికారుల భాగస్వామ్యం తప్పనిసరి



జీకే వీధిలోని సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కుమారి



వై.రామవరంలో సర్వసభ్య సమావేశంలో మాట్లాడు తున్న ఎంపీపీ ఆనందరావు

గూడెంకొత్తవీధి : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా అన్ని శాఖల అధికారులు భాగస్వామ్యం కావాలని ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా ఆయా శాఖాధికారులతో సమావేశం జరిగింది. ప్రధానంగా ఐసీడీఎస్, ఆరోగ్య, విద్యాశాఖ అధికారుల తీరుపై సభ్యులు మండిపడ్డారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుంటే అమలు చేయడంలో ఆయా శాఖలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఎంపీటీసీలు బుజ్జిబాబు, కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ దేముడు ఆరోపించారు. అనంతరం ఎంపీపీ కుమారి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడపాలని సూచించారు. ప్రభుత్వం గంజాయి సాగు నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుందని, గత ప్రభుత్వాలు చేయలేనంతగా గిరిజనుల వాణిజ్య పంట అయిన రాజ్‌మా విత్తనాలను 90శాతం రాయితీపై అందిస్తోందన్నారు. అత్యధిక శాతం విత్తనాలు మండలానికి కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు కార్యాచరణ రూపొందించామన్నారు. అన్ని గ్రామాల్లో గిరిజనులకు వైద్య సేవలు కల్పించేందుకు వైద్య బృందాలు కృషి చేయాలని ఎంపీపీ సూచించారు. సర్వసభ్య సమావేశాన్ని సర్పంచులు బహిష్కరించారు. పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో ఉమా మహేష్, ఎంపీపీ కుమారికి అందజేశారు. జెడ్పీటీసీ కిముడు శివరత్నం, వైస్ ఎంపీపీలు దేముడు, ఆనంద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భగవంతరావు, పీఆర్ జేఈ జ్యోతిబాబు, గిరిజన సంక్షేమశాఖ ఏఈ సత్యనారాయణ, పశువైద్యాధికారి షాలిని, ఏవో మధుసూదన్, ఏపీఎం రాంప్రసాద్, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశం వాయిదా

అరకులోయ రూరల్: మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం పూర్తిస్థాయిలో సభ్యులు రాకపోవడంతో వాయిదా వేసినట్టు ఎంపీపీ రంజపల్లి ఉషారాణి చెప్పారు. త్వరలో సమావేశం తేదీ ప్రకటిస్తామన్నారు.

మెరుగైన సేవలందించాలి

వై.రామవరం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ ఆనందరావు మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. సమావేశానికి పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పలువురు అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకాకపోవడంతో మండిపడ్డారు. ఇకపై ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూసుకోవాలని సూచించారు.

నాడు–నేడు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారికి సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని రోడ్ల అభివృద్ధికి అనుమతి పేరుతో అటవీ శాఖ ఉన్నతాధికారులే అడ్డుపడుతున్నారని, సర్వే పేరుతో కాలాయాపన చేస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు ఆరోపించారు. దీనిపై స్పందించిన ఎంపీపీ ఆనందరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఆయా రహదారుల పనులకు మార్గం సుగమం చేయాలని సమావేశానికి హాజరైన అటవీ, ఆర్అండ్‌బీ శాఖాధికారులకు సూచించారు. వైస్ ఎంపీపీలు జోగిరెడ్డి, విశ్వమ్మ, కో–ఆప్షన్ సభ్యులు రమణ, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, సర్పంచ్ బాలురెడ్డి, ఎంపీడీవో అశోక్‌కుమార్, తహసీల్దార్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



రంపచోడవరంలో లబ్ధిదారులకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



రాజవొమ్మంగిలో కోళ్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



గంగవరంలో కోళ్లను పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

రంపచోడవరం : స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా సభ్యుల లబ్ధిదారులకు పెరటికోళ్లనుసర్పంచ్ మంగా బొజ్జయ్య, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ అందజేశారు. వారు మాట్లాడుతూ డ్వాక్రా సంఘ మహిళలు పెరటికోళ్ల పెంపకంతో స్వయం ఉపాధి పొంది ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. వైస్ సర్పంచ్ కన్నబాబు, ఎంపీడీవో ఎం.విజయ్ రత్నకుమార్, వెలుగు డీపీఎం అపర్ణ, ఏపీఎం బి.అప్పారావు పాల్గొన్నారు.

గంగవరం : స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో డ్వాక్రా మహిళలకు పెరటికోళ్ల యూనిట్లను ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి , జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం వైస్ ఎంపీపీ గంగాదేవి, సర్పంచ్ అక్కమ్మ తదితరులు పంపిణీ చేశారు. ఏపీఎం రాజు , వెలుగు సీసీ విజయలక్ష్మి , గంగారత్నం, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పీహెచ్‌సీ భవన పనులను ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, వైస్ ఎంపీపీ గంగాదేవి బుధవారం పరిశీలించారు.ఆధునిక సదుపాయాలతో భవనం పనులు జరుగుతున్నాయని, త్వరలో అందుబాటులో వస్తుందన్నారు.

రాజవొమ్మంగి: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి డ్వాక్రా మహిళలకు ఆసిల్ కోళ్లను అందజేశారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు వరలక్ష్మి, ఏపీఎం ఆదినారాయణ, ఎంపీడీవో కె.బాపన్నదొర, వైస్ ఎంపీపీ చంద్రరాణి, ఎంపీటీసీ సభ్యులు నిర్మలాదేవి, సర్పంచ్‌లు శుభలక్ష్మి, జగన్నాథం, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

రంపచోడవరం : సీతపల్లి గ్రామంలోని గండి బాపనమ్మ అమ్మవారి దేవస్థానంలో హుండీని బుధవారం లెక్కించినట్టు ఆలయ చైర్మన్ బొబ్బా శేఖర్ తెలిపారు. అయిదు నెలలు 27 రోజులకు గాను రూ.8,17,873 హుండీ ఆదాయం వచ్చినట్టు తెలిపారు. జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కె.చంద్రతేజ హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు , ఎంపీపీ బంధం శ్రీదేవి పాల్గొన్నట్టు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత గ్రామంగా కొండగోకిరి



యువ సైన్యంతో కలిసి సమావేశం నిర్వహించిన మురళీకృష్ణ

కొయ్యూరు: రానున్న వందరోజుల్లో కొండగోకిరి గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గ్రామాన్ని దత్తత తీసుకున్న మురళీ కృష్ణ తెలిపారు. ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్లాస్టిక్ రహిత గ్రామంగా చేస్తామన్నారు. ఆయన మాట్లాడుతూ యువసైన్యం చైర్మన్ కిరణ్‌కుమార్ అధ్యక్షతన గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా చేయాలని తీర్మానించామన్నారు. ప్రతీ ఇంటికి తిరిగి రెండు గుడ్డ సంచులు ఇస్తామన్నారు. తడి, పొడి చెత్త వేసేందుకు అవసరమైన వస్తువులను అందజేస్తామన్నారు. యువసైన్యం అధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ మూలంగా కలిగే అనర్థాలపై లఘు చిత్రాన్ని నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో గోపాల్‌మిత్ర లోకేష్, దిలీప్, రాజు, లవకుశ, కళ్యాణ్, మనోజ్, దుర్గ తదితరులు పాల్గొన్నారు

అంగన్‌వాడీ సేవలు మరింత విస్తృతం



అంగన్‌వాడీలకు స్మార్ట్‌ఫోన్లు ఇస్తున్న ఎంపీపీ సీతమ్మ, నేతలు

ముంచంగిపుట్టు: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ఎంపీపీ సీతమ్మ స్మార్ట్ ఫోన్‌లను బుధవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలు మరింత విస్తృతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.రోజువారి విధుల వివరాలను యాప్‌లలో అప్‌లోడ్‌గా చేయాలన్నారు. సీడీపీవో రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నేతలు పద్మారావు, రాంప్రసాద్, రఘునాథ్, తిరుపతిరావు, వలంటీర్ దేవా తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండల కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో 160 సెంటర్లకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లకు సీడీపీవో పి.విజయకుమారి స్మార్ట్‌ఫోన్‌లను అందజేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ్ యాప్‌లలో రోజూవారీ వివరాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. మండల పరిధిలో 60 కేంద్రాలకు నెట్‌వర్క్ లేకపోవడంతో వారానికి ఒకసారి వివరాలను ఆఫ్‌లైన్ ద్వారా పంపించే అవకాశం కల్పించినట్టు చెప్పారు. అల్లూరి జిల్లాలో 70 శాతం వరకు పనుల్లో కొయ్యూరు మండలం మొదటిస్థానంలో ఉందన్నారు. గ్రేడ్–2 సూపర్‌వైజర్ల కోసం 26 దరఖాస్తులు వచ్చాయని, వారికి ఈనెల 18న పరీక్ష ఉంటుందన్నారు. సూపర్‌వైజర్లు లలిత, బాలామణి, సుజాత పాల్గొన్నారు

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

రంపచోడవరం: మండలంలోని చిన్న బీరంపల్లి గ్రామంలోని పాఠశాలను ఎంపీపీ బంధం శ్రీదేవి బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఐదోవ తరగతి విద్యార్థులను ఇంగ్లిష్, గణితానికి సంబంధించిన పలు ప్రశ్నలు అడిగారు. వాటికి విద్యార్థులు సరైన సమాధానం చెప్పలేదు. దీనిపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సరైన విద్యా ప్రమాణాలు నేర్పించాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాలలో నాడు–నేడు పనులు త్వరగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నరసాపురం పీహెచ్‌సీని ఎంపీపీ బంధం శ్రీదేవి తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. వైద్యాధికారి ఎటువంటి అనుమతి లేకుండా సెలవు పెట్టడాన్ని గుర్తించారు. పీహెచ్‌సీలో 15 మంది సిబ్బందికి ఏడుగురు మాత్రమే అందు బాటులో ఉండడాన్ని గమనించారు. రోగులకు కిందిస్థాయి సిబ్బంది ఏవో మందులు పంపిణీ చేయడం, స్టాఫ్‌నర్స్ వైద్యం చేయడాన్ని గుర్తించి, వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు అందు బాటులో వైద్యులు లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఆస్పత్రి నిర్వహణ అధ్వానంగా ఉందని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

సారా పులుపు ధ్వంసం: ఇద్దరి అరెస్టు



పులుపును ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది

రాజవొమ్మంగి: బలిజపాడు గ్రామంలో బుధవారం జరిపిన దాడుల్లో సారా తయారీకి ఉపయోగించే 800 లీటర్ల పులుపు, సామగ్రి ధ్వంసం చేసి, ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ ఆనంద్ చెప్పారు. అదే గ్రామంలో 10 లీటర్ల సారాతో మరో వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ ఫణీంద్రకుమార్, దుర్గారావు, అనిత, రమణ గ్రామస్తులున్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన



కన్నవరంలో వంగ తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త చిరంజీవి

రంపచోడవరం: మండలంలోని కన్నవరం, రంపచోడవరంలోని వంగ తోటలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.చిరంజీవి బుధవారం పరిశీలించారు. తెగుళ్లపై తీసుకోవాల్సి జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వంగ తోటల్లో వేరు కుళ్ళు, ఆకుముడత తెగళ్ళు అధికంగా ఉండడాన్ని గుర్తించమన్నారు. వంగతోటల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అదే విధంగా వేరుకుళ్ల తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటరు నీటికి మూడు గ్రాముల చొప్పున కలిపి మొక్క మొదలు దగ్గర పోయాలని సూచించారు. ఆకుమూత, కాయ కుళ్లు తెగుళ్లకు కాపర్ అక్సిక్లోరైడ్ లీటర్ నీటికి మూడు గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని చెప్పారు.

టీడీపీ నాయకుల తీరుపై ధ్వజం



జి.మాడుగులలో మాట్లాడుతున్న సర్పంచ్‌లు రాంబాబు, రామకృష్ణ



అనంతగిరిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆనంద్, నేతలు

జి.మాడుగుల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తూ, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని, ఆయన పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని మండల సర్పంచ్‌ల ఫోరం గౌరవాధ్యక్షుడు రాంబాబు, అధ్యక్షుడు రామకృష్ణ, ఎంపీటీసీ సన్యాసిదొర, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు చెప్పారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి చేపడుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు కుట్ర రాజకీయాలు చేస్తున్నారన్నారు. మూడేళ్ల తరువాత టీడీపీ నాయకులకు ప్రజలు గుర్తుకొచ్చారని, అన్న క్యాంటీన్ పేరుతో మభ్యపెట్టాలని చూస్తున్నారని, ప్రజలు గమనిస్తున్నారన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే రానున్న ఎన్నికల్లో ప్రజలు పట్టం కడతారని స్పష్టం చేశారు. టీడీపీ నేతల దుష్ప్రచారాన్ని వారు ఖండించారు. గంగరాజు, చిట్టిబాబు, రామకృష్ణ, రమణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని గిరిజనులున్న రొంపల్లి, గురుగుబిల్లి, గుమ్మకోట, ఎన్ఆర్‌పురం, భీంపోల్ పంచాయతీలను నాన్ షెడ్యూల్డ్ పంచాయతీలుగా మారడానికి టీడీపీ నాయకులేనని, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శెట్టి ఆనంద్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు స్వార్థ రాజకీయాలతో 90శాతం గిరిజనులున్న ఆయా గ్రామాలను నాన్‌షెడ్యూల్ పంచాయతీలుగా ప్రకటించడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నాన్ షెడ్యూల్ పంచాయతీలను షెడ్యూల్ మార్చాలని అసెంబ్లీలోని ప్రస్తావించి, తీర్మానించారని, దీనిపై టీడీపీ నాయకులకు తెలీదా ఘాటుగా స్పందించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూర్యానారాయణ, సర్పంచ్ పెంటమ్మ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కృష్ణమూర్తి, నాయకులు నవీన్, శ్రీను, రాజు, దేవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం



పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ మురళి

అడ్డతీగల: పెరటి కోళ్ల పెంపకం వల్ల మహిళలకు అదనపు ఆదాయం సమకూరుతుందని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.మురళి అన్నారు. అడ్డతీగలలోని సెర్ప్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు పెరటి కోళ్ల యూనిట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి యూనిట్‌కి 12 కోళ్లు ఉంటాయన్నారు.వాటితో పాటు 30 కిలోల దాణా అందజేస్తున్నామన్నారు. మండలంలో మూడు పాయింట్లకు గాను 200 యూనిట్లు కోళ్లు పంపిణీ చేశామన్నారు. ఒక్కో యూనిట్ విలువ రూ.4,800 ఉంటుందన్నారు. ఏపీడీ శ్రీనివాసరావు, సర్పంచ్ చిట్టమ్మ, ఎంపీటీసీ సూర్యకాంతం, ఏపీఎం దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

మంచుసోయగం



అనంతగిరి: మండలంలోని ఘాట్‌రోడ్డులో డముకు వ్యూపాయింట్ వద్ద బుధవారం మంచు అందాలు పర్యాటకులకు కనువిందు చేశాయి. పాలసముద్రాన్ని తలపించే తెల్లని మంచును తిలకిస్తూ సందర్శకులు మంత్రముగ్ధులయ్యారు. మరో చెరువులవేనం అంటూ సంబరపడ్డారు.

300 మందికి వైద్య పరీక్షలు

రాజవొమ్మంగి: ఎల్ఎల్ఎం విమోచన మందిరం ఆధ్వర్యంలో ఈబీసీ డైరెక్టర్ చంటిబాబు సాయంతో బుధవారం వైద్య శిబిరం నిర్వహించి, 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్లు సజ్జాశ్వేత, వెంకటరావు, నేతలు రామకృష్ణ, జ్యోతి, శుభలక్ష్మి పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ మరమ్మతుకు నిధుల మంజూరుపై హర్షం

జి.మాడుగుల: నుర్మతిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సూరిబాబు మాట్లాడుతూ చెక్‌డ్యామ్ మరమ్మతుకు ప్రభుత్వం రూ.2.86లక్షలు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. పంచాయతీ కార్యదర్శి సతీష్‌ను సన్మానించారు.